www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence

08.

nipuna
Every Wednesday Free Supplement

14 ఆగస్టు 2024
పేజీలు 8

### గవర్నర్ల సదస్సు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్లు వారధిగా ఉండాలని గవర్నర్ల సదస్సులో నిర్ణయించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన ఈ సమావేశం ఆగస్ట్ 2, 3 తేదీల్లో నిర్వహించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సంక్షేమం విస్తరించేలా గవర్నర్లు కృషి చేయాలని, అలాగే ప్రజలతో పరస్పర సంభాషణలు జరపాలని ప్రధాని మోదీ సూచించారు. అణగారిన వర్గాలకు సాయంగా ఉండే సామాజిక సంస్థలతో కూడా చర్చలు జరపాలని చెప్పారు.

## క్రీడలు

**ఒలింపిక్స్**

- హాకీలో భారత్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. స్పెయిన్‌పై విజయం సాధించి ఈ ఘనతను దక్కించుకుంది. 1968, 72 సంవత్సరాల్లో రెండు వరుస ఒలింపిక్స్‌లో విజయం తర్వాత, మళ్లీ 2020, 2024 ఒలింపిక్స్‌లో రెండుసార్లు వరుసగా కాంస్య పతకాన్ని భారత్ సాధించింది.
- నీరజ్ చోప్రా వెండి పతకాన్ని సాధించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఆయన బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. రెండు వరుస ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించిన క్రీడాకారుల జాబితాలో చేరాడు.



- 100 గ్రాములు అధికంగా బరువు ఉన్నారన్న కారణంతో వినేశ్ ఫోగాట్‌ను ఒలింపిక్స్ నుంచి అనర్హురాలిగా ప్రకటించారు.
- రెజ్లర్ అంతిమ్ పంఘాల్‌ను మూడు సంవత్సరాల పాటు నిషేధిస్తూ ఐవోసీ నిర్ణయం తీసుకుంది. కేవలం క్రీడాకారులు మాత్రమే ప్రవేశించాల్సిన క్రీడా గ్రామానికి తన చెల్లెలిని తీసుకెళ్లేందుకు ఆమె ప్రయత్నించిందనే నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.
- ఒలింపిక్స్ షటిల్ క్రీడలో సెమీ ఫైనల్‌కు చేరిన భారత తొలి క్రీడాకారుడిగా లక్ష్య సేన్ రికార్డ్ సృష్టించాడు.
- 50 మీ రైఫిల్ పోటీలో స్వప్నిల్ కుసాలే కాంస్య పతకాన్ని పొందాడు.



## అంతర్జాతీయం



**సామాజిక-ఆర్థిక మండలి**

- ఐక్యరాజ్య సమితికి చెందిన ఆరు అంగాల్లో సామాజిక, ఆర్థిక మండలి కూడా ఒకటి. దీనికి అధ్యక్షుడిగా కెనడాకు చెందిన బాబ్ రే ఎన్నికయ్యారు. అలాగే ఈ సంస్థలో ప్రత్యేక సంప్రదిపుల స్థాయిని భారత్‌లో ఒడిశాకు చెందిన కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీకి కల్పించారు.

**మూడు దేశాల పర్యటన**

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిజీ, న్యూజిలాండ్, తైమూర్-లెస్టే దేశాల్లో పర్యటించారు. ఫిజీ దేశ పార్లమెంట్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని ఇచ్చారు. న్యూజిలాండ్‌లో అంతర్జాతీయ విద్యా సదస్సులో ప్రసంగించారు. ఆగస్ట్ 7న ఫిజీలో, 8, 9 తేదీల్లో న్యూజిలాండ్‌లో, 10న తైమూర్-లెస్టేలో పర్యటించారు. పలు అవగాహన ఒప్పందాలు ఆయా దేశాలతో కుదిరాయి.

**బంగ్లాదేశ్**

- బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి మహ్మద్ యూనస్ నేతృత్వం వహిస్తున్నారు. ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశం నుంచి నిష్క్రమించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల రగడ తీవ్ర హింసకు దారి తీయడంతో ఆమె రాజీనామా చేశారు. దీంతో సైన్యం రంగంలోకి దిగి అత్యవసర పరిస్థితి ప్రకటించింది. అధ్యక్షుడు పార్లమెంట్‌ను కూడా రద్దు చేశారు.

**వియత్నాం**

- గుజరాత్‌లోని లోథాల్‌లో నేషనల్ మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసేందుకు భారత్, వియత్నాం భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.



## వార్తల్లో వ్యక్తులు

**వికాస్ లఖేరా**

- అసోం రైఫిల్స్‌కు కొత్త డైరెక్టర్ జనరల్‌గా వికాస్ లఖేరా నియమితులయ్యారు.

**చల్లా శ్రీనివాసులు శెట్టి**

- ఎస్‌బీఐకి ఛైర్మన్‌గా ఆగస్ట్ 28న తెలంగాణలోని అలంపూర్ జోగులాంబ జిల్లాకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి బాధ్యతలు స్వీకరించనున్నారు.

**సుందర్ పిచాయ్**

- గూగుల్ సంస్థకు నేతృత్వం వహిస్తున్న సుందర్ పిచాయ్‌కి ఐఐటీ ఖరగ్‌పూర్ గౌరవ సత్కారం చేసింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఈ కార్యక్రమం జరిగింది.

**శోభన రనడే**

- సామాజిక సేవ కార్యకర్త శోభన రనడే మరణించారు. ఆమె చేసిన సేవకు 2001లో పద్మభూషణ్ అవార్డ్ ఇచ్చారు.

**యామినీ కృష్ణమూర్తి**




- ప్రముఖ సంప్రదాయ నృత్యకారిణి యామినీ కృష్ణమూర్తి ఆగస్ట్ 3న మరణించారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ తదితర నాట్యాల్లో ఆమె ఆరితేరినవారు. ఆమెకు 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మవిభూషణ్ అవార్డులు లభించాయి. 1977లో ఆమె సంగీత నాటక అకాడమీ అవార్డును కూడా అందుకున్నారు.

## తెలంగాణ

**అమెరికా పర్యటన**

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి. అవి..
- వివింట్ ఫార్మా సంస్థ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో రూ.400 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
- కొత్త ఆవిష్కరణల అభివృద్ధికి కార్నింగ్ ఇన్‌కార్పొరేటెడ్ సంస్థ ముందుకొచ్చింది. అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో తెలంగాణ ప్రభుత్వానికి కార్నింగ్ సంస్థ సహకారం అందిస్తుంది.
- ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ తెలంగాణలో విస్తరించనుంది. 10 లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించనుంది. కొత్త కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది.
- అమెరికాకు చెందిన వాల్ష్ కర్రా హోల్డింగ్స్ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. రానున్న ఐదేళ్లలో వీహబ్‌లో సుమారు రూ.42 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.
- ఆర్థిక సేవల్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ ష్వాబ్ సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో తమ సాంకేతిక అభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ సంస్థ భారత్‌లో ఏర్పాటు చేయనున్న తొలి కేంద్రం ఇదే.



**వామపక్ష తీవ్రవాద జిల్లాలు**

- దేశ వ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదం ఉన్న జిల్లాలు 38 ఉన్నాయని కేంద్రం పేర్కొంది. తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2010లో దేశ వ్యాప్తంగా 465 స్టేషన్ల పరిధిలో ఉన్న వామపక్ష తీవ్రవాదం 2024 నాటికి 89 పోలీస్ స్టేషన్లకు తగ్గిపోయింది.

**నైపుణ్య విశ్వవిద్యాలయం**

- ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయానికి మహీంద్ర గ్రూప్ సంస్థల అధినేత ఆనంద్ మహీంద్ర ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

**పారిశ్రామిక పార్క్**

- ఖమ్మం జిల్లా మధిర మండలం ఎండపల్లిలో పారిశ్రామిక పార్క్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. రూ.45 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మిస్తున్నారు. ఇందుకు కేటాయించిన స్థలం 84 ఎకరాలు.

**ఐటీలో మెరుగైన వృద్ధి**

- ఐటీ, ఐటీ ఆధారిత ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో హైదరాబాద్ మంచి వృద్ధిని నమోదు చేసింది. దేశ వ్యాప్త వృద్ధి రేటు కంటే అధికంగా ఇక్కడ నమోదవుతుంది. వృద్ధికి సంబంధించి ఇతర గణాంకాలు..
- 2023-24 ఏడాదికి తెలంగాణలో ఐటీ ఎగుమతుల విలువ రూ. 2,68,233 కోట్లు
- అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 11.2% ఎక్కువ. అయితే జాతీయ స్థాయి వృద్ధి రేటు కేవలం 3.3% మాత్రమే.
- ఐటీ ఉద్యోగాల కల్పన కూడా హైదరాబాద్‌లో బాగా ఉంది. కొత్తగా 40 వేల మంది యువతకు ఈ రంగంలో ఉపాధి లభించింది.
- ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 9.46 లక్షలకు చేరింది.
- 2022-23తో పోలిస్తే ఉద్యోగుల వృద్ధి రేటు 4.5% పెరిగింది.

## రోజులు-ప్రాముఖ్యత




**హిరోషిమా రోజు**

- ఏటా ఆగస్ట్ 6న హిరోషిమా రోజుగా, 9న నాగసాకి రోజుగా నిర్వహిస్తారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఆ ప్రాంతాలు అణుబాంబు దాడికి గురయ్యాయి.

**ఆగస్ట్ 7**

- ఏటా జాతీయ జావెలిన్ త్రో డేగా నిర్వహిస్తారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఆగస్ట్ 7న భారత్ తరఫున నీరజ్ చోప్రా బంగారు పతకాన్ని సాధించాడు. అప్పటి నుంచి ఈ రోజును జావెలిన్ త్రో డేగా నిర్వహిస్తున్నారు. అదే విధంగా ఇదే రోజున జాతీయ చేనేత దినోత్సవంగా కూడా నిర్వహిస్తారు.

## జాతీయం

**డిజిటల్ శక్తి కేంద్రం**

- జాతీయ మహిళా కమిషన్ అలాగే సైబర్ పీస్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా డిజిటల్ శక్తి కేంద్రాన్ని ప్రారంభించాయి. మహిళలకు వ్యతిరేకంగా ఎలాంటి సైబర్ నేరాలు జరగకుండా ఉండేందుకు ఈ కేంద్రాలు పనిచేస్తాయి. సాంకేతిక సహాయంతో పాటు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తాయి.

**అనలాగ్ రీసెర్చ్ సెంటర్**

- చంద్రుడు, కుజ గ్రహాలపై అధ్యయనానికి అనలాగ్ రీసెర్చ్ స్టేషన్ పేరుతో లఢఖ్‌లో ఒక పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేయొచ్చని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. లఢఖ్‌లో ఉండే పొడి, శీతల వాతావరణాలు చంద్ర ఉపగ్రహం, కుజ గ్రహాల వాతావరణాన్ని తలపిస్తాయని శాస్త్రవేత్తలు ఈ ప్రదేశాన్ని ఎంపిక చేశారు.



**వ్యవసాయ ఆర్థిక వేత్తల సమావేశం**

- వ్యవసాయ ఆర్థిక వేత్తల 32వ సమావేశం భారత్‌లోని న్యూఢిల్లీలో ఆగస్ట్ 2 నుంచి 7 వరకు నిర్వహించారు. 75 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. గతంలో 1958లో భారత్‌లో ఈ సమావేశం జరిగింది. నాడు మైసూర్‌లో నిర్వహించారు. సుస్థిర, పర్యావరణ అనుకూల వ్యవసాయం చేయడంతో పాటు రైతులకు ఆదాయం ఎలా రావాలన్న అంశంపై ఇందులో చర్చించారు. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'సుస్థిర వ్యవసాయ-ఆహార వ్యవస్థల దిశగా పరివర్తన' ఇతివృత్తంతో ఈ సమావేశం నిర్వహించారు.

**కొత్త యాప్‌లు**

- ఈ-సాక్ష్య, న్యాయ సేతు, న్యాయ శ్రుతి, ఈ-సమన్ అనే యాప్‌లను కేంద్రం ప్రారంభించింది. కొత్తగా వచ్చిన క్రిమినల్ చట్టాలకు సంబంధించినవి ఇవి. వీడియో, ఫొటోలను దాచి ఉంచే యాప్ ఈ-సాక్ష్య. అలాగే ఎలక్ట్రానిక్ పద్ధతిలో సమన్లను జారీ చేసేందుకు ఉద్దేశించింది ఈ-సమన్. ఒక విచారణకు సంబంధించి సమగ్ర సమాచార నిక్షిప్తాన్ని కలిగి ఉన్నదే న్యాయ సేతు. న్యాయ శ్రుతిని కూడా ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో స్వయం చోదితంగా పోలీసులు, ప్రాసిక్యూషన్, కోర్టులను అనుసంధానం చేసే వ్యవస్థ ఇది.

**గవర్నర్ల సదస్సు**

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్లు వారధిగా ఉండాలని గవర్నర్ల సదస్సులో నిర్ణయించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన ఈ సమావేశం ఆగస్ట్ 2, 3 తేదీల్లో నిర్వహించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సంక్షేమం విస్తరించేలా గవర్నర్లు కృషి చేయాలని, అలాగే ప్రజలతో పరస్పర సంభాషణలు జరపాలని ప్రధాని మోదీ సూచించారు. అణగారిన వర్గాలకు సాయంగా ఉండే సామాజిక సంస్థలతో కూడా చర్చలు జరపాలని చెప్పారు.

**నెమలి అభయారణ్యాలు**



- కర్ణాటకలో అదిచుంచనగిరి, కేరళలో చులనూర్‌లను నెమలి అభయారణ్యాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

**పర్యావరణ సున్నిత ప్రదేశం**

- పశ్చిమ కనుమల్లో 56,825.7 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పర్యావరణపరంగా సున్నిత ప్రాంతంగా ప్రకటిస్తూ కేంద్రం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ సున్నిత ప్రాంతం విస్తరించింది. గాడ్గిల్, కస్తూరి రంగన్ కమిటీల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

వి. రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411

